భారతమ్మకు నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బీఎన్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మద్దిరాలపాడు గ్రామ తెలుగు దేశం పార్టీ నాయకులు నెప్పల హరిబాబు సతీమణి వెంకట భారతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సంత నూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ ఆదివారం మద్దిరాలపాడులోని హరిబాబు స్వగృహానికి వెళ్లి వెంకట భారతమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరిబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి తన సంతాపాన్ని తెలియజేశారు. మండలం పార్టీ అధ్యక్షులు తేళ్ల మనోజ్ కుమార్, సీనియర్ నాయకులు గుమ్మడి సాయిబాబా, గ్రామ పార్టీ అధ్యక్షులు పెనుబోతు సునీల్, తాళ్లూరి ఆంజనేయులు, షేక్ కాలేషా, పార్లమెంట్ సాంస్కృతి విభాగం సెక్రటరీ నందిగం కోటయ్య, మండవ వాసు, స్వర్ణ కిషోర్ నివాళులర్పించారు.

విశాలాంధ్ర
ప్రకాశం జిల్లా

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మండలం ఏరువారిపల్లి గ్రామంలోని ఆదివారం అంకాలమ్మ దేవస్థానం వద్ద సిమెంట్ రోడ్డు పనులు వైసీపీ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, సర్పంచ్ డి.వెంకటయ్య, ఎంపీటీసీ యం రమణారెడ్డి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా జరగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్తులు ఆదినారాయణ, చినబాబు,వెంకటరెడ్డి కొండారెడ్డి, ఆటో జగన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు

విశాలాంధ్ర-దొనకొండ: మండలంలోని కొచ్చెర్లకోటలో శ్రీ వీరాంజనేయస్వామి తిరునాళ్ళ సందర్భంగా ఆదివారం రాష్ట్ర స్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలు గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగాయి. గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన మీనిగ కాశయ్య ఎద్దులు 2757 అడుగులు లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. బేస్తవారిపేట మండలం జేసీ అగ్రహారానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎద్దులు 2706 అడుగులు లాగి 2వ స్థానంలో, పల్నాడు జిల్లా పిడుగురాళ్ళ మండలం శ్రీనివాసపురం కాలనీకి చెందిన సప్పిలి అంజిరెడ్డి ఎద్దులు 2600 అడుగులు లాగి 3వ స్థానంలో, దర్శి మండలం దర్శికి చెందిన గానుగపంట రాజశేఖరరెడ్డి ఎద్దులు 2304 అడుగులు లాగి 4వ స్థానంలో నిలిచాయి. తాతలు గాజులపల్లి నాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, జాజుల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ వడ్లమూడి వెంకటేశ్వర్లు, రామిరెడ్డి కలికిరెడ్డి సమకూర్చిన నగదు బహుమతులు రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు విజేతలకు గ్రామస్తులు అందజేశారు.

'పదవ' పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-పామూరు : నేటి నుండి జరుగు పదో తరగతి పరీక్షలలో అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకుంటామని పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కే శ్రీనివాస రావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పామూరు లో ఐదు పరీక్ష కేంద్రాలు, సిఎస్పురంలో రెండు, వెలిగండ్లలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో వ్యాపార సముదాయాలు, జిరాక్స్ సెంటర్లుకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల్లోనికి సిబ్బందిని తప్ప ఎవరిని అనుమతించమని తెలిపారు. పరీక్ష పేపర్ లీకేజీ మాల్ ప్రాక్టీస్ కు పాల్పడే వారిపై సక్రమపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసువారికి ప్రజల సహకరించాలని సిఐ శ్రీనివాసరావు కోరుతున్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

విశాలాంధ్ర-వెలిగండ్ల : పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు వెలిగండ్ల ఏపీఎస్ ఆంధ్ర ప్రజాసమితి ఆధ్వర్యంలో రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళి కృష్ణ సౌజన్యంతో శనివారం విద్యార్థులకు ప్యాడ్, పెన్సిల్లు స్కేలు రబ్బర్లు చెక్కుడు మరలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని పదవ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థిని విద్యార్థులకు ఈకొద్దిపేట సహాయం అందిస్తున్నట్టు చాలామంది పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ కనీస అవసరాలు కూడా తీర్చుకోవాలని స్థితిలో ఉన్నారని ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలతో పాటు పరీక్షలకు ఇటువంటి సహాయం చేయటం నాకు ఈ అవకాశం కల్పించడం మంచిదని విద్యార్థులందరూ మూడో తేదీ జరుగుతున్న పరీక్షలకు సన్నద్ధమవుతున్నందున ప్రతి ఒక్కరు పరీక్షలలో చక్కని మార్కులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దమ్ము వెంకీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఏప్రిల్ నెల మూడవ తేదీ సోమవారం నుండి జరగబోవు పదవ తరగతి పరీక్షలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎల్ సంపత్ కుమార్ తెలిపారు. ఆదివారం ముండ్లమూరులో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఆదర్శ పాఠశాలలో ఈ మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయని, ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు మూడు కేంద్రాల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పరీక్షా కేంద్రాల ఆవరణలో ప్రభుత్వం నిబంధనలను అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థిని విద్యార్థులు ఉదయం 9:30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

టీడీపీ వస్తేనే అభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

విశాలాంధ్ర-తర్లుపాడు : టీడీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి పదంలో నడుస్తుందని మార్కాపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. వెనుకబడిన పశ్చిమ ప్రాంత ప్రజల అభ్యున్నతి కోసం, శ్రీ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలని, మార్కాపురంను జిల్లాగా చేయాలని దృఢమైన సంకల్పంతో మార్చి 26వ తేదీన కందుల ప్రజా చైతన్య పాదయాత్రను ప్రారంభించిన విషయం విధితమే. ఎనిమిదవ రోజు అనగా ఆదివారం మేకల వారి పల్లి, ఓబాయిపల్లి, లక్ష్మక్క పల్లి, కొండారెడ్డిపల్లి, నాతనంపల్లి గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగి సాయంత్రం ఆరు గంటలకు మంగళ కుంట గ్రామంలోని రామాలయం గుడి వద్దకు చేరుకొని బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల యొక్క అభివృద్ధే నా ధ్యేయమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో తెలుగు దేశ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. దీంతో మార్కాపురం జిల్లాగా మార్చి ప్రతి ఒక్కరి అభివృద్ధికి తోడ్పడుటమే కాక,వెలిగొండ ప్రాజెక్టును త్వరితగతులు పూర్తిచేసి రెండేళ్లలోపు ప్రతి ఎకరాకు నీరందించే బాధ్యత నేను తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి పార్టీ యొక్క అరాచకాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, భూదందాలు, అక్రమ కేసులతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారన్నారు. నాకు ఎన్నికల్లో మీరు వేసే ఒక ఓటుతో పశ్చిమ ప్రాంత ప్రజలకు రెండు ముఖ్యమైన ప్రయోజనాలు చేకూరుతాయని అన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్ఆర్ పార్టీని గ్రాడ్యుయేట్స్ పూర్తిగా వ్యతిరేకించాలన్నారు. వైయస్సార్ పార్టీకి రాష్ట్రంలో వ్యతిరేక పవనాలు ఇస్తున్నాయని, తెలుగుదేశం ప్రభుత్వానికి పూర్వవైభం తెచ్చేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే అన్ని రకాల మౌలిక వసతులతో అభివృద్ధి చెందింది అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివ ృద్ధి శూన్యమని,సామాన్య ప్రజలు బతికే రీతిలో లేరని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగాదివాలా తీసింది అన్నారు. ఈ పాదయాత్రకు కొండేపి ఎమ్మెల్యే డోల వీరాంజనేయ స్వామి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుమల అశోక్ రెడ్డి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌లు పూర్తి సంఘీ భావాన్ని తెలిపారన్నారు. మంగళ కుంట గ్రామ ఇలాకాలో అన్యాక్రాంతమైన భూములను అర్హత కలిగిన పేదలకు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ ఉడుముల చిన్నపరెడ్డి, యూనిట్ క్లస్టర్ కుందూరు కాశిరెడ్డి, ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, క్లస్టర్ సాదం వీరయ్య, నంబుల లక్ష్మయ్య, మేకలచ్చిరెడ్డి, నాలి బాల వెంకటేశ్వర్లు, తాను గుండాల వెంకటేశ్వరరెడ్డి, కే.నరసింహారావు, పెసల వెంకటేశ్వర్లు, జి నరసింహారావు, ఈర్ల వెంకటయ్య, అన్నపురెడ్డి వెలుకొండారెడ్డి, వి పిచ్చిరెడ్డి, ఉడుముల కృష్ణారెడ్డి, వెన్న వెంకటరెడ్డి, అన్నపురెడ్డి చెన్నారెడ్డి, మండల స్థాయి టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టీజేఆర్‌కు కరపత్రాల సెగ

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబుకు సొంత పార్టీ నుండి అవినీతి ఎమ్మెల్యే అంటూ కరపత్రాల సెగ తగిలింది. ఎమ్మెల్యే తీరును నిరసిస్తూ ఆయనకు వ్యతిరేకంగా నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పేరుతో అవినీతి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు వద్దు సమన్వయకర్త ముద్దు అంటూ ముద్రించిన కరపత్రాలు ఆదివారం ఉప్పుగుండూరులో వెలుగు చూడడంతో అటు రాజకీయ వర్గాల్లోనూ సామాన్య ప్రజల్లో సైతం కలకలం సృష్టించాయి. అవినీతి ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు వద్దు సమన్వయకర్త ముద్దు అంటూ కరపత్రాలు ఉప్పుగుండూరులోని రైల్వే స్టేషన్ రోడ్ జంక్షన్ వద్ద జాతీయ రహదారి పై గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లడంపై రాజకీయ దుమారం రేగింది. ఈ విషయం జిల్లా మీడియాలో ప్రసారం కావడంతో జిల్లావ్యాప్తంగా కరపత్రాల చర్చ మొదలైంది. విషయం తెలుసుకున్న పోలీసులు రోడ్లపై వదిలి వెళ్ళిన కరపత్రాలను స్వాధీనం చేసుకొని వాటిని వదిలి వెళ్ళిన వ్యక్తులను గుర్తించే పనిలో ఉన్నారు.

'ఆసరా'తో మహిళల ఆనందం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : వైయస్సార్ ఆసరా పథకంతో మహిళలు ఆనందంగా ఉన్నారని స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. ఆదివారం అమ్మన బ్రోలు గ్రామంలో వైయస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని వైయస్సార్ క్రాంతి పదం ఏపిఎం రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆనాడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన విధంగా వైయస్సార్ ఆసరా పథకమును అమలు చేస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం జరిగిందన్నారు. నాలుగు విడతల్లో రుణమాఫీ నగదును డ్వాక్రా గ్రూపు అక్క చెల్లెమ్మలకు అందిస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా మూడోసారి రుణమాఫీ నగదు గ్రూపు మహిళల ఎకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు.అక్క చెల్లెమ్మలకు చెప్పిన విధంగా డ్వాక్రా రుణాలను మాఫీ చేసుకుంటూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళల జీవితాల్లో ఆనందాన్ని నింపుతున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా డ్వాక్రా మహిళలు వైయస్సార్ ఆసరా సంబరాలను జరుపుకోవడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలు మరింతగా అభివ ృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి మహిళ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆసరా సంబరాల కట్ చేశారు. మండల పరిధిలోని 1733 వైఎస్ఆర్ క్రాంతి పదం గ్రూపు మహిళలకు 13కోట్ల 59 లక్షల రుణమాఫీ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాణిజ్యవిభాగం ప్రధాన కార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మారేళ్ల బంగారు బాబు, వైయస్సార్ క్రాంతి పదం ఏసి విజయమ్మ, ఏపీఎం రవికుమార్ సర్పంచ్ బత్తుల రవీనా, వైసీపీ నాయకులు పరంధామరెడ్డి, పోలవరపు శ్రీమన్నా రాయణ, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కోయి హనుమయ్య, కోమట్ల త్రినాధ్‌రెడ్డి, మాదాసు రాంబాబు, ఉప్పుగుండూరు వాసు ప్రసాద్ పాల్గొన్నారు.

'రామతీర్థం'కు టీడీపీ విద్యుత్ ప్రభ

గ్రామాల నుండి వచ్చిన కార్యకర్తలు బైక్ ర్యాలీ అభిమానులతో రోడ్లన్నీ పసుపుమయం అయ్యాయి.

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రముఖ పుణ్యక్షేత్రంమైన రామతీర్థం నందు ఈ నెల 5వ తేదీన జరగనున్న గంగ తిరుణాళ్ళ సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభను భారీ ఊరేగింపుతో రామతీర్థంకు తరలించారు. ఈ కార్యక్రమానికి ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు ఇన్‌ఛార్జ్ మాజీ ఎమ్మెల్యే బి.ఎన్ విజయకుమార్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. నాయకులు ఇరువురిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రాలపై ఊరేగించారు. ఈ ఊరేగింపుతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులకు కొత్త ఉత్సాహం నింపింది. చుట్టు పక్కల

పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : సోమవారం నుంచి ఏప్రిల్ 18 వరకు ప్రతీ రోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం12.45 గంటల వరకు నిర్వహించు పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు దోర్నాల ఎస్సై యం శ్రీనివాసరావు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసి వేయిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, చిట్టీలు, పుస్తకాలు పెట్టి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ కు విద్యార్థులు ఎవరైనా పాల్పడినా, వారికి ఎవరైనా సహకరించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి చిన్న ఘటన జరిగిన వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీస్ వాట్సాప్ 9121102194 కు సమాచారం అందించాలని కోరారు.

నేటి నుంచి పది పరీక్షలు

విశాలాంధ్ర-తాళ్లూరు : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ సోమవారం నుండి ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి గురజాల సుబ్బయ్య తెలిపారు. 2022- 23 విద్యా సంవత్సరంలో తాళ్లూరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుండి 778 మంది 7 కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. మండల కేంద్రమైన తాళ్లూరులో ఊటుకూరు కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఊటుకూరు కోటయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి హైస్కూల్ మూడు కేంద్రాలలో, తూర్పు గంగవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రగతి హై స్కూల్ రెండు కేంద్రాలలో, బొద్ది కూరపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమెరికన్ పబ్లిక్ స్కూల్ రెండు కేంద్రాలలో పరీక్షల నిర్వహణ జరుగుతుందని దీని కొరకు చీఫ్ సూపర్డెంట్లు, డిపార్మెంట్ అధికారులు, సిట్టింగ్ స్క్వాడు, ఇన్విజిలేటర్ల నియామకం తదితర ప్రక్రియ పూర్తి చేశామని పరీక్షలు సజావుగా జరిగేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, విద్యార్థులు సివిల్ డ్రెస్సులు మాత్రమే వేసుకోవాలన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : పెద్ద దోర్నాల మండలం నందు పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడమైనదని మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ నాయక్ తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ఈ నెల 03 నుండి 18 వరకు జరుగుతాయని, విద్యార్థులందరికీ ఉదయం 8:45గంటల నుండి పరీక్ష కేంద్రాలలోనికి అనుమతించబడును. దోర్నాల మండల కేద్రం నందు మొత్తం 4 సెంటర్లలో 560 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాజరు అవుతారని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు 229మంది విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కాలేజీ నందు 180 మంది విద్యార్థులు, రవీంద్ర హైస్కూల్ నందు 128 మంది విద్యార్థులు, మరియు కస్తూరిబా.గురుకుల విద్యాలయం నందు 103 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అన్నీ రకాల ఏర్పాట్లు కల్పించడమైనది. మండల కేంద్రంలోని 4 పరీక్ష కేంద్రాలలో విద్యార్థులందరికీ డెస్క్ లు, మంచినీటి వసతి, వెంటిలేషన్ కొరకు లైట్స్ మరియు ఫాన్స్, ఏర్పాటు చేయడమైనది. అదేవిధంగా పరీక్షలు జరిగే 4 పరీక్ష కేంద్రాలలో సెల్ ఫోన్ అనుమతించబడవు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా 4 పరిక్షా కేంద్రాలలో వద్ద మెడికల్ సిబ్బందిని నియమించడం జరిగినది. ప్రతి పరీక్షా దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని మండల విద్యాశాఖ అధికారి మస్తాన్ నాయక్ తెలియజేశారు.

పదవ తరగతి పరీక్షల్లో హద్దులు మీరితే కఠిన చర్యలు

సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.దేవకుమార్

విశాలాంధ్ర-కురిచేడు : కురిచేడు టౌన్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం.దేవ కుమార్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పరీక్షలకు వచ్చే విద్యార్థిని విద్యా ర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు మొబైల్స్ ఎలక్ట్రానిక్ వాచీలకు అనుమతి లేదని పరీక్ష కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా ఉండి అవాంఛనీయ సంఘటనలు చేస్తే కేసులు నమోదు చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు పోలీసు వారికి సహకరించాలని ప్రశాంత వాతావరణంలో పరీక్షలు పూర్తి చేయాలని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని అందరు నడుచుకోవాలని ఎస్ఐ కోరారు.

గుంటి గంగలో భక్తుల కోలాహలం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలో గల గుంటి గంగక్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల నుండి కాక జిల్లా నలుమూలల నుండి భక్తులు పాల్గొని నైవేద్యాలతో అమ్మవారి ముక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారిణి పి విజయలక్ష్మి అమ్మవారి మూల విరాట్‌ను పట్టు వస్త్రాలతో, పూలమాలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించారు. తదుపరి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు .గుంటిగంగ దేవాలయం ట్రస్ట్ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు దేవాలయంలోనే ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 206 దర్శనం టికెట్లు, 8 వాహన పూజలు జరిగాయని, భక్తులు అమ్మవారికి 4 చీరలు, 1416 రూపాయలు విరాళాలు అందించారని, ఆదివారం ఒక్క రోజు 3,876 రూపాయలు ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది, దేవాలయ ట్రస్ట్ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కరువు భత్యం వెంటనే చెల్లించాలి

ఆపస్ డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన కరువు భత్యం వెంటనే చెల్లించాలని, సంపాదిత సెలవు నగదు,ఇంకనూ చెల్లించాల్సిన పీఎఫ్, తదితర బకాయిలు చెల్లింపునకు తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్. శ్రావణ్ కుమార్ కోరారు. ఒంగోలులోని సంఘ కార్యా లయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా అధ్యక్షులు శ్రీ కమ్మ మల్లికార్జునరావు మాట్లాడుతూ గత పదవ తరగతి పరీక్షలలో పనిచేసి క్రమశిక్షణ చర్యలకు గురైన ఉపాధ్యాయులపై తిరిగి చర్యలు తగవని, ప్రస్తుతం జరుగుతున్న 10వ తరగతి పరీక్షల సక్రమ నిర్వహణకు ప్రభుత్వం కృషి చేయాలని ప్రతి చిన్న విషయానికి ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం తగదని, పరీక్ష రోజు సెలవు ప్రకటించిన పాఠశాలలు తిరిగి సెలవు రోజుల్లో పనిచేయాలనడం సమంజసంగా లేదని అన్నారు. ఈ సమావేశంలో ఏకేవీకే కళాశాల ప్రిన్సిపాల్ కే వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా బాధ్యులు నరసింహారావు, గుణ ప్రసాద్, టీవీ శేషారావు,ఏ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి హరిహర క్షేత్రం వార్షికోత్సవ వేడుకలు



- విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు రాక
- రెండు రోజులు హోమాలు, శాంతి కల్యాణం, మహా అన్న సంతర్పణ
- మాజీమంత్రి శిద్దా రాఘవరావు ఆధ్వర్యంలో విశేష హోమాలు, పూజలు
- హాజరుకానున్న ప్రముఖులు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఏప్రిల్ 4 నుండి రెండు రోజుల పాటు శ్రీ హరిహర క్షేత్రం 17వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు, ఆలయ ధర్మ కర్తలు ఒక ప్రకటనలో తెలియచేశారు. శ్రీ హరిహర క్షేత్రం ప్రతిష్ఠించి 16 సంవత్సరాలు పూర్తి చేసుకొని సప్తాదశవ వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా విశాఖ శారదా పీఠం శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, మరియు విశాఖ శారద పీఠం ఉత్తరాధికారి శ్రీ శ్రీ శ్రీ స్వాత్మా నందేంద్ర స్వామి ఆధ్వర్యంలో ఏప్రిల్ 4 వ తేదీ నుండి 5 వ తేదీ వరకు శ్రీ హరిహర క్షేత్రం 17 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శిద్దా రాఘవరావు తెలిపారు. పీఠాధిపతులు స్వరూపా నందేంద్ర మహాస్వామి మరియు ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్ర నందేంద్ర స్వామి వారు శ్రీ హరిహర క్షేత్రంలో జరుగు కార్యక్రమాలలో స్వయంగా పాల్గొని భక్తుల కోసం అనుగ్రహ సంభాషణలు ఇస్తారని శిద్దా రాఘవరావు వివరించారు .అంతే కాకుండా ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ ఆలయాల ఆస్థాన పండితులు,రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన వేద పండితులు పాల్గొంటారని శిద్దా రాఘవరావు తెలిపారు. శ్రీ హరిహర క్షేత్రంలో రెండు రోజులపాటు జరిగే హెూమాలు, విశేష పూజా కార్యక్రమాలు, అయ్యప్పస్వామి మహా పడి భజన,మహా పూర్ణాహుతి, నగరోత్సవం, శాంతి కల్యాణంలో భక్తులు పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలు పొంది తీర్థప్రసాదాలు స్వీకరించాలని శిద్దా రాఘవరావు భక్తులకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా మట్టల ఆదివారం

దొనకొండ

కొనకనమిట్ల

మార్కాపురం టౌన్

త్రిపురాంతకం

బేస్తవారిపేట

కనిగిరి

విశాలాంధ్ర-దొనకొండ: లోక రక్షకుడు క్రీస్తు ప్రభువు గాడిద పిల్లనెక్కి రాజుగా యెరూషలేముకు చేరుకున్న సందర్భంలో ఆనాటి యూదులు ఒలీవ కొమ్మలతో కిరీటమును అల్లి క్రీస్తు శిరస్సున అలంకరించి, ఖర్జూర మట్టలు చేత పట్టుకుని యూదుల రాజా హోసన్నా... దావీదు తనయా హోసన్నా అంటూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు మ్రాని కొమ్మల ఆదివారంగా కొనియాడటం ఆచారంగా వస్తుంది. ఇందులో భాగంగా స్థానిక కతోలిక క్రైస్తవులు సెయింట్ ఆన్స్ హస్పటల్ నుంచి మ్రాని కొమ్మలు చేబూని దావీదు తనయునకు హోసన్నా అంటూ ఎలుగెత్తి చాటుతూ పునీత అంతోని వారి దేవాలయం చేరుకున్నారు. రెవ.ఫాదర్ స్టెనిస్లాస్ ప్రార్థనలు నిర్వహించి మ్రానికొమ్మల ఆదివారం యొక్క విశిష్టతను వారికి వివరించారు. సెయింట్ ఆన్స్ సిస్టర్స్ మరియు కతోలికులు పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని ఏబియం చర్చి పాస్టర్ డి.ప్రభుదాస్ ఆధ్వర్యంలో సండే స్కూల్ చిన్నారులు, సంఘస్తులు, సంఘ పెద్దలు తదితరలు పూలతో అలంకరించిన ఈత మట్టలతో పురవీధుల్లో రాజులకు రాజుకే జై...ప్రభువుల ప్రభువుకే జై..అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఇదే విధంగా మండలంలోని అన్ని చర్చిల క్రైస్తవులు మ్రానికొమ్మల ఆదివారం భక్తి శ్రద్ధలతో కొనియాడారు.

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ సోదరులు ఆదివారం మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎదుర్రాళ్లపాడు మండల కేంద్రమైన కొనకనమిట్ల అంబాపురం నాయుడుపేట గ్రామాల్లోని పాస్టర్లు జి.కిషోర్ కుమార్ చింతకుంట్ల కోలా రవికుమార్‌ల ఆధ్వర్యంలో చిన్నారులు మట్టలు చేత పట్టుకుని ఆ గ్రామాల్లోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. రాజుల రాజుకు జయము గాక దావీదు కుమారునికి విజయం కలుగును గాక క్రీస్తు పేరిట వచ్చు ప్రభువు స్తుతింపబడును గాక అంటూ చిన్నారులు మట్టలు చేత పట్టుకొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బారవాహిక పశువు అయినా గాడిద పిల్లను ఎక్కి ఏసు ప్రభువు వారు ఎరుషలేముకు జయప్రద ప్రవేశం చేయుట మట్టల ఆదివారం యొక్క ప్రాముఖ్యత. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని చర్చిల్లో మట్టల ఆదివారం యొక్క ప్రాముఖ్యత గురించి పాస్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల చిన్నారులు పాస్టర్లు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో గల ఆర్‌సిఎం చర్చి నందు రెవరెండ్ ఫాదర్ జాన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ ఏసుప్రభు ఎరుషలేం నగరాన్ని 18 సార్లు సందర్శించారన్నారు. అయితే 18వ సారీ యెరూషలేమును సందర్శించడంలో ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఏసుప్రభు మరణిస్తున్నాననే సంగతి తెలిసి కూడా సంతోషంగా ఎరుషలేములోకి ప్రవేశించి మరణానికి ఎదురు వెళ్లారన్నారు. అయనను వెంబడించేవారు అయన నడుస్తున్న దారిలో కొమ్మలు రెమ్మలతో కూడిన వస్త్రాలను పరిచారన్నారు. వెంబడిస్తున్న ప్రజలు దావీదు కుమార జయము, ప్రభువు పేరిట వచ్చిన వారు స్తుతింపబడుదురు, సర్వోన్నతునికి జయం అని నినాదాలు చేసుకుంటూ వెంబడించారన్నారు. తుదకు కొందరి తప్పుడు ఆరోపణల వల్ల ఏసుప్రభును సిలువ వేసి ఆయన మరణానికి కారణమయ్యారన్నారు. నాటి ఏసుప్రభు ఎరుషలేము ప్రయాణమే పరలోక ప్రయాణం అయిందన్నారు. అనంతరం కతోలికులు కొబ్బరి మట్టలతో సెయింట్ ఆన్స్ స్కూల్ నుండి పాటలు పాడుకుంటూ ఏసుప్రభును స్తుతించుకుంటూ అందరూ ఆలయంలోకి ప్రవేశించి ప్రార్థన సాంఘ్యములో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కన్యా స్త్రీలు పీటర్ ఫిలో, అఖిల, నిరోషా మేరీలు, ఉపదేశి జయన్నలు పాడిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి.

విశాలాంధ్ర-త్రిపురాంతకం : త్రిపురాంతకం మండలంలోని త్రిపురాంతకం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ నాని జాన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజుపాలెంలో బాప్టిస్ట్ చర్చ్ నుండి త్రిపురాంతకం బస్టాండ్ సెంటర్ వరకు బారి ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీలో చిన్నారులు, సంఘస్తులు ఈత మట్టలను పూలతో అలంకరించి ర్యాలీలో ప్రదర్శించారు. ఈ ర్యాలిలో దావీదు కుమారుడా జయము జయము,యేసు రాజుకు జయము, హోసన్నా హోసన్నా అంటూ నినాదాలు చేశారు. యేసును శిలువ వేయడానికి ముందుగా గాడిదపై యెరూషలెం వీధులలో వురిగించరని అలాగే దానికి సాదృ ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో త్రిపురాంతకం తెలుగు బాప్టిస్ట్ చర్చ్ చిన్నారులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-బేస్తవారిపేట : స్థానిక బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో ఫాదర్ జాన్ రంగయ్య ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిలీవర్స్ చర్చి నుండి జంక్షన్ వరకు ఈత మట్టలు పట్టుకొని దావీదు తనయ యేసయ్య అంటూ నినాదాలు ర్యాలీ నిర్వహించారు. లెంట్ డేస్ ముగింపు సందర్భంగా 40 రోజులు ఉపవాసం ఉండి ప్రార్ధనలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. గుడ్ ఫ్రైడే వరకు జరిగే ఈ పరిశుద్ధ అందరూ గుడ్ ఫ్రైడేను జరుపుకొంటూ యేసుక్రీస్తు నడిచిన ప్రేమ, దయ, జాలి, కరుణ, క్షమాపణ గుణములు కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో బ్రదర్ ఆగస్టిన్, డి. చిట్టిబాబు, ప్రశాంతి, అనిత, పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చ ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఆదివారం పండగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా చర్చిలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ ప్రభు మనోహర్ దాస్ ఏసుక్రీస్తు పునరుద్ధానం గురించి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. క్రైస్తవ సోదరులు చేతిలో ఖర్జూరం మట్టలు పట్టుకొని కనిగిరి పురవీధుల్లో ర్యాలీగా క్రీస్తు నామస్మరణ చేస్తూ క్రీస్తు పేరిట వచ్చేవారికి జయము జయము అంటూ గీతాలు పాడుకుంటూ చిన్నారులు మహిళలు మట్టల ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గం బాపిస్ట్ చర్చ్ చైర్మన్ గంటా విద్యాసాగర్, సర్వోన్నత కుమార్, రత్నకుమార్ ఏల్పఫాన్, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పగడ్బందీగా పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర-పీసీపల్లి : నేటి నుండి ఏప్రిల్ 18 వరకు ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:45 నిమిషాల వరకు పదో తరగతి పరీక్షలు జరుగు నేపథ్యంలో ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గర్గ ఆదేశాల మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ఏ నాగేశ్వరరావు తెలియజేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని పరీక్ష కేంద్రాలకు స్మార్ట్ వాచ్ మొబైల్ ఫోన్స్ ఐప్యాడ్ ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని పరీక్ష కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు పరీక్షకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర వ్యక్తులు దరిదాపుల్లో ఉండకూడదని మాస్ కాపీ మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థిని విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు.

నాలుగు పరీక్షా కేంద్రాలు

విశాలాంధ్ర-శింగరాయకొండ : నేటినుండి ప్రారంభం కానున్న పదవతరగతి పరీక్షలకు సంబంధించి శింగరాయకొండ మండలంలో నాలుగు కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తారని ఎంఇవో శివన్నారాయణ పేర్కొన్నారు. జడ్పీహైస్కూలు (బాలికలు), గవర్నమెంట్ హైస్కూలు, భాష్యం హైస్కూలు, గురుకుల పాఠశాలల్లో పదవతరగతి పరీక్షలు జరుగుతా యన్నారు. 800 మంది విద్యార్థులు ఈపరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలను ఆయన పర్యవేక్షించి, ఏర్పాట్లు పరిశీలించారు. పరీక్షా కేంద్రం ఏర్పాట్ల గురించి పరీక్షల అదికారులతో ఆయన చర్చించారు. సరైన కారణం లేకుండా ఒక్క నిముషం ఆలశ్యమైనా పరీక్షకు అనుమతించారన్నారు.

మహిళలకు అండగా 'వైఎస్సార్ ఆసరా'

విశాలాంధ్ర-కంభం : కంభంలోని స్థానిక వాసవి విద్యాసంస్థలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం జరిగింది. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పేద మహిళలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాలలో భాగంగా ఆదివారం కంభంలోని శ్రీ వాసవి కళాశాల ఆవరణలో అర్థవీడు, కంభం, బేస్తవారిపేట మండలాల పరిధిలోని మహిళలకు ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని మాట్లాడారు. అక్క చెల్లెమ్మల కోసం ముఖ్యమంత్రి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. డ్వాక్రా మహిళలను చంద్రబాబు నమ్మించి మోసం చేస్తే సీఎం జగన్ ఆసరా పథకం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడో విడతలో రూ.6,419 కోట్లు మహిళల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, మండల అధికారులు, పొదుపు మహిళా సంఘాల సభ్యురాళ్లు, పొదుపు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దర్శనాపురి నాటకళాపరిషత్ నాటక పోటీలు

విశాలాంధ్ర-దర్శి : దర్శనాపురి కళాపరిషత్ ఆధ్వర్యంలో మే నెల 19, 20 తేదీల్లో నాటక పోటీలునిర్వహించనున్నట్లు సర్వసభ సమావేశం నిర్ణయించారు. 19వ తేదీ శుక్రవారం రెండు నాటికలు, 20వ తేదీ శనివారం మూడు నాటికలు, 21వ తేదీ ఆదివారం రెండు నాటికలు ప్రత్యేక ప్రదర్శన, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లేని వేదికను కీర్తిశేషులు బూచేపల్లి సుబ్బారెడ్డి మరియు వెంకాయమ్మల సౌజన్యంతో వేదికను నిర్మించడం జరిగినది. 19వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాటకరంగా నిష్ణాతులు సినీ ప్రముఖులచే వేదిక ప్రారంభోత్సవం కార్య క్రమం నిర్వహించబడుతుందని, పై కార్యక్రమంలో చందు డాన్స్ అకాడమీ ఒంగోలు వారిచే నృత్య మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల రాజంపల్లి విద్యర్థినిలతో కోలాటంతో వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దర్శనాపురి నాటక కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు కలవకొలను అనంత్ మరియు అంబటి సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కూనం జైహింద్‌రెడ్డి మరియు గౌరవ సభ్యులు ప్రకటనలో తెలిపారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి

పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-పామూరు : వైకాపా పాలనలో విద్యా దీవెన పథకం విద్యా శాపం పథకంగా, వసతి దీవెన పథకం వసతి శాపం పథకంగా తయారైందని పిసిసి సభ్యులు వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2008లో కాంగ్రెస్ పార్టీ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ పథకాలను ప్రవేశ పెట్టడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగులు, కాపులకు చెందిన పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని ఉద్దేశంతో ఈ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకాలను ప్రవేశపెట్టింది. డిగ్రీ విద్యార్థులకే కాకుండా పీజీ విద్యార్థులకు కూడా ఈ పథకాలు వర్తించేవి, పర్యవసానంగా లక్షలాదిమంది పేద విద్యార్థులు ఉన్నత చదువు చదివి ఉన్న స్థాయి ఉద్యోగాలు పొంది సమాజంలో ఉన్నత ప్రమాణాలతో జీవిస్తున్నారు. దురదృష్టవశాత్తు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ పథకాలు పేర్లు మార్చడం జరిగింది. ఫీజు రీయింబర్స్మెంట్‌కు విద్యా దీవెన అని, స్కాలర్షిప్ కు వసతి దీవెన అని పేర్లు మార్చడం జరిగింది ఇప్పటికైనా వైకాపా ప్రభుత్వం ఈ జీవో నెంబర్ 77 ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు.

పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్త్

డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి

విశాలాంధ్ర-దర్శి : 10వ తరగతి పరీక్షా కేంద్రాలకు ఎలాంటి స్మార్ట్ వాచ్, మొబైల్ ఫోన్స్, ఐపాడ్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని డీఎస్పీ నారాయణస్వామి అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఇన్విజిలేటర్లు మరియు పరీక్షకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది గానీ వ్యక్తులు అనుమతిలేని మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ వంటి చర్యలకు విద్యార్థులు ఎవరైనా పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈ నెల 3 నుంచి ఏప్రిల్ 18 వరకు ప్రతీ రోజు ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం12.45 గంటల వరకు నిర్వహించు పదవ తరగతి పరీక్షలు సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకోటయ్య, ఎస్సై రామకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాపన్న గౌడ్‌కు నివాళి

విశాలాంధ్ర-మార్కాపురం : గౌడ సంఘం అధ్యక్షులు గజ్జ రమణ గౌడ్ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 323వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం స్థానిక సాయి తేజ కంటి వైద్యశాలలో జరిగింది. ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం గౌరవ అధ్యక్షులు ఇల్లూరు రంగస్వామి గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తుదిశ్వాస వరకు కృషి చేశారని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించడం కోసం ఆనాటి నైజాం నవాబులకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేసి 32 కోటలను ఆక్రమించి తొలి బహుజన రాజుగా, వీరుడిగా పేరు గడించిన గొప్ప నేత సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని, కావున అటువంటి గొప్ప నేతను ఆదర్శంగా తీసుకోని, మనము కూడా రాజ్యాధికారం కోసం రాబోయే రోజుల్లో ఎన్నో ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు గజ్జ రమణ గౌడ్,కోశాధికారి కంచర్ల నాగార్జున గౌడ్, గౌరవ అధ్యక్షులు మాదాసు రంగనాయకుల గౌడ్,ఉపాధ్యక్షులు కంచర్ల వెంకటేశ్వర్లు గౌడ్, గౌరవ సలహాదారు కొమర వెంకట నరసింహారావు గౌడ్, సభ్యులు జూపల్లి వెంకటరావు గౌడ్, దొంత కృష్ణ గౌడ్, గజ్జ వెంకటేశ్వర్లు గౌడ్, గుడ్ల వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లు

విశాలాంధ్ర-తాళ్లూరు : నేటి నుండి జరిగే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు గట్టి భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై బి ప్రేమ్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాళ్లూరు మండలంలో తాళ్లూరు, తూర్పు గంగవరం, బొద్ది కూరపాడు గ్రామాలలో ఏర్పాటుచేసిన ఏడు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 45 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన అన్నారు. పరీక్షాకేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, ఇన్విజిలేటర్లు తప్ప మరెవ్వరూ పరీక్ష కేంద్రాల వద్ద ఉండకూడదని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు తో పాటు, ఒక మొబైల్ టీం ఉంటుందని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ లు, చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఏవి అనుమతించబడవని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మోహన్ రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో యువతకు అన్యాయం

మాజీ ఎమ్మెల్యే ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపుల్లో యువతకు తీరని అన్యాయం జరిగిందని, యువతకు ఉపాధి కల్పించినట్లు కల్పించుటలో జగన్ ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వారం ముగిసిన గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌లో ఫేక్ పెట్టుబడులతో మోసం చేసిన ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్ కేటాయింపుల్లో కూడా అంకెల గారడితో రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించిందన్నారు. పరిశ్రమలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం వాటిని తరి మేసిందని, జాబ్ క్యాలెండర్ ద్వారా 2లక్షల 30 వేల ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పిన జగన్‌రెడ్డి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం హయాంలో 2018 -19 లో గ్రోత్ రేట్ 32.1 శాతంగా ఉంటే,వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఈ సంఖ్య 2021-22 నాటికీ,మైనస్ 10.4 శాతానికి పడి పోయిందన్నారు.నాడు తెలుగుదేశం హయాంలో ఏపీలో విదేశీ పెట్టుబడులు అధికంగా ఉంటే,నేడు ఏపీలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు కరువయ్యారన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రంలోని అన్నీ వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, రాష్ట్రంలో జగన్ మోసపురెడ్డి ప్రభుత్వం అంకెల గారడీతో ఎన్నో రోజులు తప్పించుకోలేదని, రాబోవు ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని,రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చిన ప్రజలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు కొండయ్య యాదవ్, పెద్దబాష, బాషా, కృష్ణ, బొమ్మినేని వెంకటేశ్వర్లు, సురేష్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, రాఘవ తదితరులు ఉన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర-కనిగిరి : పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఈఓ జై ప్రసాద్‌రావు ఆదివారం తెలిపారు. కనిగిరి మండలంలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో కనిగిరి బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆల్ఫా స్కూల్, శ్రీ చైతన్య స్కూల్, సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ పరీక్షా కేంద్రాలు కాగా కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాలలో ఏ, బి రెండు పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 23 కేంద్రాల్లో 3,430 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు వసతులు కల్పించడంతోపాటు వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచు తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు పరీక్షా సమయంలో ఉండకూడదన్నారు.

జగన్ పాలనలో దళితులకు రక్షణ కరవు

విశాలాంధ్ర-పామూరు : దళితులపై దాడులకు వైసిపి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డోల శేషాద్రి, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు యాదాల మాలకొండయ్య ఆరోపించారు. కడప జిల్లా పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అచ్చన్న విషయంలో సరైన సమయంలో స్పందించి ఉంటే అచ్చెన్న బ్రతికి ఉండేవారని ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే హత్య జరిగిందని ఇది ప్రభుత్వ హత్య అని అన్నారు. దళిత డ్రైవర్ యువకుడిని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అనంత బాబు చంపేసి డోర్ డెలివరీ చేసిన కనీసం ముఖ్యమంత్రి స్పందించలేదన్నారు. మాస్కులు లేవని అడిగిన పుణ్యానికి డాక్టర్ సుధాకర్ పై పిచ్చోడని ముద్ర వేసి మానసికంగా శారీరకంగా హింసించి ఆత్మహత్య చేసుకొనేలా ప్రేరేపించారన్నారు. సీఎం బటన్ నొక్కుడు కార్యక్రమాల్లో నా ఎస్సీ, ఎస్టీ లు అని అనటమే కాని దళితులపై హత్యలు, దాడులు జరిగినా కనీసం స్పందించలేదని. అదే తమ్ముడు అవినాష్ పై హత్య ఆరోపణలు వస్తే అసెంబ్లీ సాక్షిగా బాధపడుతూ వివరణ ఇచ్చాడన్నారు.

పరీక్షా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఎస్ఐ నాగమల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కంభం : 10వ తరగతి పరీక్షా కేంద్రాలలో తీసుకోవలసిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై ఎస్ఐ వి నాగమల్లేశ్వరరావు పరీక్షల సిబ్బందితో చర్చించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం పది పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు మరియు డిపార్ట్మెంటల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందరేగా ఎస్ఐ.నాగ మల్లేశ్వరరావు మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లుమరియు ఇతర సిబ్బంది పరీక్షా సమయంలో అప్రమత్తంగా ఉండాలనీ, పరీక్షా కేంద్రాల లోపల బయట ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా విధులను నిర్వర్తించాలని అన్నారు. విద్యార్థులు,పరీక్షల సిబ్బంది ఏ ఒక్కరూ సెల్ ఫోన్స్ ఇతర డిజిటల్ పరికరాలను వినియోగించే అనుమతి లేదని, నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందనీ,ప్రశ్న పత్రాల తరలింపు నుండి పరీక్ష ముగిసే వరకు పోలీసు సిబ్బంది అందుబాటులో వుండి పూర్తి సహకారాన్ని అందిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బి.మాల్యాద్రి, మండలంలోని అన్ని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గిద్దలూరు : నియోజకవర్గ పరిధిలోని గిద్దలూరు పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘ సర్వ సభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు హాజరయ్యారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అభివృద్ధి కై పలు అంశాలపై చర్చించారు.

బుడత తిమ్మయ్యను పరామర్శించిన ముత్తుముల

విశాలాంధ్ర-గిద్దలూరు : ఆదర్శ విద్యాసంస్థల అధినేత, బీసి నాయకులు బుడత తిమ్మయ్య యాదవ్‌ను కర్నూలులోని ఆయన స్వగృహంలో నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆయన సతీమణి ఇటీవల కాలంలో స్వర్గస్తులయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఈయన వెంట పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.

గొర్రెల విషయంలో ఘర్షణ

ఒకరికి గాయాలు

విశాలాంధ్ర-పీసీపల్లి : గొర్రెలను గొర్లదొడ్డిలో మేపుకునేందుకు జరిగిన ఘర్షణలో ఇరువురు కుటుంబ సభ్యులు ఘర్షణ పడిన ఘటన మండలంలోని లింగన్నపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై నాగేశ్వరరావు కథనం మేరకు లింగన్న పల్లి గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వర్లు మాదాల రాజేంద్ర గొర్రెలమేపే గొర్రెలను దొడ్లో ఉంచే విషయంపై ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో మాదాల వెంకటేశ్వర్లు దోటితో మాదాల రాజేంద్ర పై దాడి చేయడంతో మాదాల రాజేంద్రకు గాయాలయ్యాయి. ప్రస్తుతం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు తెలియజేశారు. మాదాల రాజేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై ఏ నాగేశ్వరరావు తెలియజేశారు.

కళాకారులకు ప్రోత్సాహం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : కళాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపట్టిందని జిల్లా పౌర సంబంధాల అధికారి టి.మోహన్ రాజు అన్నారు. ఆదివారం ఒంగోలు సి.వి.ఎన్ రీడింగ్ రూమ్ లో బాలు కళా సమితి ఆధ్వర్యంలో దొరుకునా ఇటువంటి సేవా సినీసంగీ విభావరిని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సంబంధాల అధికారి మాట్లాడుతూ ప్రజల మానసిక ఉల్లాసానికి సంగీతం ఎంతో శక్తిని ఇస్తుందన్నారు. బాలుకళా సమితి ఒంగోలు వారు ఎలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అసత్య ఆరోపణలపై చర్యలు తీసుకుంటాం

విశాలాంధ్ర-సింగరాయకొండ : గత కొద్ది రోజులుగా సింగరాయకొండ పంచాయతీ పై అసత్య ఆరోపణలు సామాజిక మాధ్యమాల్లోనూ వ్యక్తిగతంగా కొన్ని పార్టీలు పనిగట్టుకుని మరి ప్రేరేపిస్తున్నారని ఆరోపణలు నిరూపిస్తే తగిన చర్యలు తీసుకుంటామని అంతేకానీ నిరాదరణ ఆరోపణలు గనుక చేస్తే చట్టపరమైన చర్యలు కూడా బాధ్యులవు తారని సింగరాయకొండ సర్పంచ్ తాటిపర్తి వనజ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ సింగరాయకొండ మండల ప్రజలకు తాటిపర్తి కుటుంబం గత ఎన్నో సంవత్సరాలుగా చేస్తున్న సేవలు అందరికీ తెలుసునని కరోనా సమయంలో కూడా ఎటువంటి స్వలాభం ఆశించకుండా నియోజకవర్గ స్థాయిలో లక్షలు వెచ్చించి ప్రజలకు సేవ చేసిన కుటుంబం తాటిపర్తి కుటుంబమని తెలిపారు. సింగరాయకొండ పంచాయితీ గెలుపొందిన తరువాత ప్రజలకు సేవ చేయడం కోసమే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చామని అదే స్థాయిలో గతంలో ఎన్నడూ లేని విధంగా పంచాయతీ సిబ్బందికి ఆరు నెలల జీతాలు సైతం తమ సొంత నిధులు వెచ్చించి ఇచ్చిన ఘనత తాటిపర్తి కుటుంబానిదని తెలిపారు. కొన్ని పార్టీలు ప్రచారం కోసం తమ మనుగడను కాపాడుకునేందుకు చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని వాటి వల్ల ఎటువంటి ఉపయోగం లేదని తెలిపారు. ఆరోపణలు చేసే వారికి కనీస అవగాహన కూడా లేకుండా మాట్లాడుతున్నారని పంచాయతీ నిధులు డ్రా చేసే విధానంలో సర్పంచ్‌కు ఒక అకౌంటు ఉంటుందని వ్యక్తి గతంగా మరొక అకౌంటు ఉంటుందని అది కూడా తెలియ కుండా అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వ్యక్తిగత దూషణలు ప్రైవేట్ కేసులు పెట్టడం తాటిపర్తి కుటుంబంకు అలవాటు లేదని నిజనిర్ధారణ చేసుకొని ఎటువంటి ఆరోపణలు నిరూపించడానికి సర్పంచ్‌గా ముందుం టానని తెలిపారు. ఎటువంటి ఫిర్యాదుల అందించిన పంచాయతీ చట్టానికి అనుసరించి సమాధానం తెలుపుతామని అన్నారు. గతంలో చేసిన పనులకి అధికారులు బాధ్యత వహిస్తూ చర్యలు తీసుకున్నారని ఆ విషయం కూడా తెలియకుండా ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అధికారుల పాలన సాగినప్పుడు ఎన్నో తప్పిదాలు జరిగాయని ఇప్పటి అధికారులు తమ ఇష్టాను సారంగా పంచాయతీ నిధులు దారి మళ్లించాలని అప్పటి తప్పిదాలను మాపై రుద్దుతూ ప్రత్యేక ఆరోపణ చేస్తున్నారని తెలిపారు. ఈ పంచాయతీకి కోటి రూపాయలు పన్నుల రూపంలో వసూలైతే సుమారు 84 లక్షల రూపాయలు జీతభత్యాలు అందిస్తున్నామని పంచాయతీ మనుగడకు సొంత నిధులు కూడా వెచ్చిస్తున్న తాటిపర్తి కుటుంబంపై ఆరోపణలు తగదని తెలిపారు.